క్లుప్తంగా

పెడన కమిషనర్‌గా గోపాలరావు బాధ్యతల స్వీకరణ



పెడన: పెడన పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా మన్నెం గోపాలరావు శనివారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై పెడన పురపాలక సంఘానికి వచ్చారు. తొలుత ఆయన పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు.

నూకాలమ్మ ఘటం ఊరేగింపు

రావివారిపాలెం(మోపిదేవి): రావివారిపాలెంలోని గ్రామ దేవత నూకాలమ్మ అమ్మవారి ఘటం బిందె ఊరేగింపు శనివారం ముగిసింది. ఐదు రోజులుగా మోపిదేవి, రావివారిపాలెం పుర వీధుల్లో పోతురాజు కర్ర డప్పుకళాకారుల సందడితో ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారని ఆలయ కమిటీ తెలిపింది.

ప్రతివారం ఫిజియోథెరపి శిబిరం

గూడూరు: గూడూరులోని భవిత కేంద్రంలో ప్రతి వారం ఫిజియోథెరపి శిబిరం నిర్వహిస్తామని బందరు ఇన్‌చార్జి డీవైఈఓ బీఎస్సీ శేఖర్‌సింగ్ తెలిపారు. శనివారం గూడూరులోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఫిజియోథెరపి శిబిరం నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ పి.కామరాజు ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఫిజియోథెరపి చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 పి.సుబ్రహ్మణ్యం, ఐఈఆర్పీ పి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

ఘంటసాల: అధికారుల అనుమతి లేకుండా ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టినా, తరలించినా చర్యలు తప్పవని తహసీల్దార్ విజయప్రసాద్ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ మాట్లాడుతూ పాపవినాశనం క్వారీ నుంచి ఎడ్లబండితో తరలిస్తున్న ఇసుకను తహసీల్దార్ కార్యాలయం వద్ద దింపించి బండి యజమానిని హెచ్చరించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు జరిగితే అధికారులకు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ విజయ ప్రసాద్ కోరారు.

300 మందికి ఉచిత వైద్యసేవలు

పెడన: దావోజీపాలెం గ్రామంలో సుమారు 300 మందికి ఉచిత వైద్యసేవలు అందించారు. కొమ్మా స్వాములు, ధనలక్ష్మి స్మారకార్థం వీరి కుటుంబసభ్యులు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం శిబిరాన్ని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. స్వాములు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. పెడన జెడ్పీటీసీ అర్జా వెంకట నగేష్, టీడీపీ మండల అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్, ప్రధాన కార్యదర్శి సీరం ప్రసాద్, నందిగామ సర్పంచ్ బొడ్డు చిన్నబాబు, ఉప సర్పంచ్ కాగిత లక్ష్మీ నాగేశ్వరరావు, నక్షత్ర దంత వైద్యశాల వైద్యులు కొమ్మా బ్రహ్మారావు, కొమ్మ బాల సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

148 మందికి నేత్ర పరీక్షలు

చల్లపల్లి(అవనిగడ్డ): స్థానిక వీఆర్‌కే నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 148 మందికి కంటి పరీక్షలు చేశారు. చల్లపల్లిలోని క్లబ్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రాయపాటి రాధాకృష్ణ, కార్యదర్శి కస్తూరి ప్రసాద్, మాజీ అధ్యక్షుడు నర్రా సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కోడూరు: వినాయకచవితి పర్వదినం పురస్కరించుకొని గ్రామాల్లో ఏర్పాటు చేసుకొనే గణనాథుల విగ్రహాల విషయంలో కమిటీ సభ్యులు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శిరీష అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసుకొనేవారు పోలీసులు అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసేవారు పంచాయతీ అనుమతి తీసుకోవాలన్నారు. ఐదుగుడులకు మించి విగ్రహాలను ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు. విగ్రహాలు ఏర్పాటు చేసేవారు స్టేషన్‌కు వచ్చి సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

భ్రమరాంబదేవికి గాజులతో అలంకారం

టి.కొత్తపాలెం(నాగాయలంక): శ్రావణ మాస పర్వతిథులను పురస్కరించుకుని నాగాయలంక మండలంలోని పురాతనమైన శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో రెండు రోజులుగా అమ్మవారికి 15 వేల రంగు రంగుల గాజులతో అలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

అన్నవరం(మోపిదేవి): అగ్ని ప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ ఆసరాగా నిలుస్తోందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోపిదేవి సబ్ బ్రాంచ్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు అన్నారు. వెంకటాపురం శివారు అన్నవరంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పేరుబోయిన నాంచారమ్మ ఇల్లు పూర్తిగా కాలిపోయిన సంగతి తెలిసిందే. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శనివారం బాధిత కుటుంబానికి స్టీల్ సామగ్రి, బియ్యం, నిత్యావసర సరకులు, కూరగాయలు అందజేశారు. రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, సర్పంచ్ తుమ్మా సోములమ్మ, వీఆర్వో కేవీ ప్రసాద్, కార్యదర్శి జి.సుధాకర్, వీఆర్‌ఏ వెంకటేశ్వరావు, డీలర్ మధు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించాలి



సమాజంలో సోషల్ మీడియా ప్రభావం పెరిగిన నేపథ్యంలో చిన్న వయసు నుంచే వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించాలి. ఇష్టం లేని వారితో ఎలా వ్యవహరించాలో నేర్పాలి. కోల్‌కతా వంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కమిటీలు ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలి.

–నదిరి వాణి, యూనియన్ బ్యాంక్ కస్టమర్ సర్వీస్ అసోసియేట్, మచిలీపట్నం

శిక్షలు త్వరితగతిన పడాలి



కోల్‌కతా వంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి రాష్ట్రంలో దిశ చట్టాన్ని అమలు చేయాలి. ఘటన జరిగిన 15 రోజుల్లోనే ముద్దాయిలకు శిక్షలు పడాలి. అప్పుడే సమాజంలో కొంతైనా మార్పు వస్తుంది. డ్యూటీలో ఉన్న వైద్యులకు రక్షణతో పాటు వసతులు కల్పించాలి.

–కొండేటి అనుపమ ముఖర్జీ, రోటరీ క్లబ్ కార్యదర్శి, మచిలీపట్నం

సాగునీరు లేక ఆందోళన

- 'కోడూరు'లో నారుమళ్లను కాపాడుకునేందుకు నానాపాట్లు
- బీడువారిన పొలాల్లో పశువులు మేపుతూ రైతుల నిరసన
- పాదాలవారిపాలెం, జరుగువానిపాలెంలో సాగునీటి కష్టాలు
- ఆయిల్ ఇంజిన్లకు కూడా అందని నీరు



బీడువారిన పొలాల్లో పశువులను మేపుతూ నిరసన తెలుపుతున్న రైతులు

కోడూరు: సాగునీరు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండిపోతున్న వరి నారుమళ్లకు సాగునీటిని అందించి జీవం పోయాలంటూ రైతులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మండలంలోని 4, 5 పంట కాల్వ పరిధిలోని పాదాలవారిపాలెం, జరుగువానిపాలెం రైతులు సాగునీరు అందడం లేదంటూ బీడువారిన పొలాల్లో పశువులను మేపుతూ ఆందోళన నిర్వహించారు. ఎగువ ప్రాంతాల్లో వరినాట్లు జరుగుతుంటే తమ ప్రాంతంలో నారుమళ్లు కూడా పోసుకొనే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ పక్కనే ఉన్న పలువురు రైతులు వరినారుమళ్లు పోసుకున్నా కూడా అవి కూడా నీరు లేక ఎండిపోతున్నాయని వాపోయారు.

రాత్రి వేళల్లో పడిగాపులు

వచ్చే అరకొర నీటిని తరలించడానికి రైతులు రాత్రి వేళ కూడా పొలాల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు వంతులు వేసుకొని నీటిని తరలించుకోవడంతో పలువురు రైతులు రాత్రి సమయంలో బోదెల చుట్టూ తిరుగుతున్నారు. సర్పాల సంచారం అధికంగా ఉంది. అయినా పంటను కాపాడుకొనేందుకు కష్టాలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ అధికారులకు సమస్యను చెప్పినా కూడా పట్టించుకోవడం లేదని అన్నదాతలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. సాగునీటిపై అధికారులకు ఫోన్లు చేస్తే స్పందించరని, సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నీరు లేక నెర్రలిచ్చిన నారుమడి

క్రాప్ హాలిడే ప్రకటించి ఆదుకోవాలి

ప్రభుత్వమే క్రాప్ హాలిడే ప్రకటించి ఆదుకోవాలని పాదాలవారిపాలెం, జరుగువానిపాలెం రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంట సాగుకు అదును దాటిపోతోందని, సాగు ఆలస్యమైతే నవంబరు, అక్టోబరు నెలల్లో వచ్చే తుపాన్లు, వర్షాలకు పొలాలు దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. వరుణదేవుడు కూడా మొఖం చాటేయడంతో తమ పరిస్థితి మరీ దారుణంగా ఉందని అన్నదాతలు చెప్పుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తమ కాలువలకు సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

కాలువలకు రాని నీరు



4వ నెంబర్ పంటకాలువలో అడుగంటిన సాగునీరు

పాదాలవారిపాలెం, జరుగువానిపాలెం పంట పొలాలకు వక్కపట్లవారి పాలెం కాలువ ద్వారా సాగునీరు రావాల్సి ఉంది. ప్రధాన కాలువ నుంచి దిగువ కాలువలైన 4, 5కు సాగునీరు చేరడం గగనంగా మారింది. ఎగువ ప్రాంత రైతులు తమ పంటను బతికించుకొనేందుకు సాగునీటిని ఆయిల్ ఇంజన్ల ద్వారా మళ్లించుకుంటున్నారు. దీంతో దిగువ కాలువలకు నీరు చేరడం కష్టం మారింది. ఆయిల్ ఇంజిన్లతో నీరు తరలించడానికి కూడా కాలువలో సాగునీరు లేని పరిస్థితి. కొంతమంది రైతులు అరకొర నీటిని నానా కష్టం మీద ఇంజిన్లతో బోదెలోల్కి తరలిస్తున్నారు.

నారుమళ్లు ఎండిపోతున్నాయి



పాదాలవారిపాలెం, జరుగువానిపాలెం గ్రామాల మధ్య పదెకరాల పొలం ఉంది. ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేసేందుకు నారుమడిని పోశాను. కాలువల వెంట సాగునీరు రాక, వర్షాలు కురవకపోవడంతో నారుమడి ఎండిపోతుంది. భూమి నెర్రెలిచ్చి పైరు మాడిపోతోంది. పొలాలను దమ్ము చేసుకోవడానికి చుక్క నీరు కూడా లేక బీడుగా మారుతున్నాయి. అధికారులు స్పందించి సాగునీటిని అందించాలి.

– అప్పికట్ల వెంకటేశ్వరరావు, రైతు, జరుగువానిపాలెం

ఆయిల్ ఇంజిన్లకు కూడా నీరు రావడం లేదు



ఎగువ రైతులు కాలువలోని నీటిని తమ పొలాలకు మళ్లించుకోవడంతో ఆయిల్ ఇంజిన్లతో కూడా నీటిని తరలించుకునే అవకాశం లేకుండా పోయింది. కాలువలో ఉన్న కొద్దిపాటి నీటిని వంతులు వేసుకొని పొలాలకు మళ్లించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. చేతికొచ్చిన నారుమళ్లు చివరిలో నీరు లేకపోతున్నాయి. బీడువారిన పొలాల్లో పశువులను మేపుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించి నీటిని అందించాలి.

– జన్ను గోపాలస్వామి, రైతు, పాదాలవారిపాలెం

ప్రభుత్వమే ఆదుకోవాలి



ఆగస్టు నెలాఖరు వచ్చినా కూడా నీటిని సరఫరా చేయడంలో ఇరిగేషన్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. వంతులవారీ విధానంలో నీరు అందిస్తామని చెప్పడమేగానీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో వేలాది రూపాయిలు ఖర్చు చేసి సాగుచేసిన నారుమళ్లు ఎండిపోతున్నారు. కాలువలకు సాగునీరు ఇవ్వకపోతే రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. క్రాప్ హాలిడే ప్రకటించి నష్టపరిహారాన్ని అందించాలి.

– పరిశె భిక్షాలు, రైతు, పాదాలవారిపాలెం

విధులు సక్రమంగా నిర్వహించండి

మచిలీపట్నంటౌన్: విధులను ఉద్యోగులు సక్రమంగా నిర్వహించి నగరపాలక సంస్థకు మంచి పేరు తీసుకురావాలని కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఆయన పలు విభాగాలను పరిశీలించారు. రెవెన్యూ, అడ్మినిస్ట్రేషన్, హెల్త్ విభాగాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సమయపాలన పాటిస్తూ పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న ఆదేశాల ప్రకారం ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి సన్నద్ధంగా ఉండాలన్నారు. విధి విధానాలపై ఎప్పటికప్పుడు వాట్సాప్‌లో సమాచారం ఇస్తానని దాని ప్రకారం ఉద్యోగులు పనిచేయాలని సూచించారు.

పరుగు పందెంలో విద్యార్థి ప్రతిభ

కోడూరు: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని అవనిగడ్డలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పరుగు పందెం పోటీల్లో కోడూరు రవితేజ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థి కొప్పనాతి శివసన్ని అండర్-17 బాలుర విభాగంలో 100మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం కైవసం చేసుకున్నట్లు స్కూల్ డైరెక్టర్ వల్లభనేని వరప్రసాద్ తెలిపారు. అతన్ని డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ కొరివి అనిల్ కుమార్ కరస్పాండెంట్ కోట వెంకటేశ్వరరావు, విద్యాసంస్థల గౌరవ అధ్యక్షుడు కోట వెంకట సుబ్బారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సమన్వయంతో 'వికసిత్ ఆంధ్రప్రదేశ్'

ఘంటసాల: వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047కు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047పై కలెక్టర్ డీకే బాలాజీ శనివారం వీసీ నిర్వహించగా మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ విజయ ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల్లో పండించే పంటలకు గిట్టుబాటు ధరతో పాటు లాభాలు రావడానికి ప్రణాళికలు చేయాలన్నారు. చేనేత రంగం అభివృద్ధికి కృషి చేయడంతో పాటు అన్ని రంగాల్లో మండల, జిల్లా, రాష్ట్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ గుత్తికొండ కిషోర్, డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్, ఏవో కె.మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గోకులకృష్ణా.. గోపాలకృష్ణా



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



ఉట్టికొడుతున్న చిన్నారులు



కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కోడూరు: శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని పలు పాఠశాలల్లో నిర్వహించిన ముందస్తు వేడుకలు అంబరాన్నంటాయి. కోడూరులోని జీవీ అకాడమి విద్యాసంస్థల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో కృష్ణుడి విగ్రహానికి విద్యార్థులు శ్రీకృష్ణుడు, విద్యార్థినులు గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని జరపగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోడూరు రవితేజ పబ్లిక్ స్కూల్ కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, విద్యార్థినులు గోపికల వేషధారణలో అలరించారు. పాఠశాల డైరెక్టర్ వల్లభనేని వరప్రసాద్, ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, కరస్పాండెంట్ కోట వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

పెడన: శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ముందుగా నిర్వహించారు. ఉట్టిని కట్టి విద్యార్థులు దానిని పగలకొట్టేందుకు ప్రయత్నం చేశారు. అలా కొట్టిన వారికి కళాశాల వారు బహుమతులను అందజేశారు. అనంతరం పలు సంస్కృతిక నాటిక, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇందులో మహిళలు, యువతపై దాడులు చేస్తున్న వారి విషయంలో సత్వర తీర్పులు ఇచ్చి కఠిన శిక్షలు అమలు చేయాలని, అప్పుడే మహిళలకు రక్షణ ఉంటుందనే నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఇటీవల కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన సంఘటనను ఖండిస్తూ వీరు ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దోసపాటి బాబా, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్‌ఎస్ రెడ్డి, డిప్లమో ప్రిన్సిపాల్ ఎస్‌వీకే ప్రసాద్, కో ఆర్డినేటర్ అనిల్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: స్థానిక జవ్వారుపేటలోని శ్రీ వెంకటేశ్వర పబ్లిక్ స్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు రాధాకృష్ణుల వేషాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమాన్ని స్కూల్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. పరాసుపేటలోని శ్రీ కొమరగిరి సంస్కృతి ప్లే స్కూల్‌లో చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో అలరించారు. కార్యక్రమాన్ని ప్లే స్కూల్ డైరెక్టర్ కొమరగిరి పవన్‌సాయికృష్ణ సంతోష్, శ్రీ సురభి దంపతులు పర్యవేక్షించారు. వీరి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణునికి ప్రత్యేక పూజలను పోతు కూచి ఆంజనేయకుమార్ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాలలో శనివారం శ్రీ కృష్ణజన్మామి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టరు కిషోర్, హెచ్‌ఎం ఎన్.శ్రీనివాసరావు పండుగ ప్రాముఖ్యాన్ని వివరించారు.

రేపు శ్రీరామపాదక్షేత్రంలో కృష్ణాష్టమి వేడుకలు

నాగాయలంక: స్థానిక శ్రీరామపాదక్షేత్రంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు శనివారం చెప్పారు. మధ్యాహ్నం ఉట్టి కొట్టే కార్యక్రమం జరుగుతుందని ఇతర వివరాలకు క్షేత్రపాలకుడు తలశిల రఘుశేఖర్‌ను 9490636466 నంబర్లో సంప్రదించవచ్చని సూచించారు.



ఆటపాటల్లో చిన్నారులు



మచిలీపట్నంలో..



బంటుమిల్లిలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

విద్యార్థుల భోజనంలో తేడా వస్తే జైలే



భోజనం పరిశీలిస్తున్న జడ్జి బాబూనాయక్

మోపిదేవి: పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో ఏదైనా తేడా జరిగితే బాధితులకు జైలు శిక్ష ఉంటుందని అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బాబూనాయక్ హెచ్చరించారు. మోపిదేవి గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఇబ్బందులు, వసతులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక స్థాయిలో చదువుకు మంచి ఫౌండేషన్ వేయాలని అప్పుడే ఉద్యోగాలు కూడా మంచివి వస్తాయని తెలిపారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నందున విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడాలని, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బయట ఆహార పదార్థాలను లోనికి రానివ్వకూడదని, రాత్రిపూట వాచ్‌మన్ మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. డ్రింకింగ్ వాటర్ ఆర్వో ప్లాంట్ వద్ద పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మరోసారి ఆకస్మికంగా వసతిగృహాన్ని తనిఖీ చేస్తామని ఏమైనా సమస్యలు మా దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు పాఠశాల తరగతి గదులు, లైబ్రరీ, స్టాఫ్‌రూం, బాత్‌రూములు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఏజీపీ ఈశ్వరావు, ఏపీపీ సీహెచ్‌వీకే ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రఘురాంప్రసాద్, సీనియర్ న్యాయవాది అందె శ్రీరామమూర్తి, ప్రిన్సిపాల్ కె.వీరరవి పాల్గొన్నారు.

అంతర్గత రహదారుల అభివృద్ధి

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని ఒకటో వార్డులో పలుచోట్ల అంతర్గత రహదారులను బాగుచేశారు. రోడ్ల పక్కన పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కలను తొలగించారు. ఆర్యవైశ్య కాలనీలోని రెండు రోడ్లు, హరిత హాస్పటర్ రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ చేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని స్థానికులు ఆది, భూపతి శ్రీను తదితరులు పర్యవేక్షించారు.

సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడి

కోడూరు: రైతులు సాంకేతిక పద్ధతులు వినియోగించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించాలని ఏఓ ఎం.శ్రీధర్ అన్నారు. ఉల్లిపాలెం గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వరిసాగులో పాటించాల్సిన ఆధునిక పద్ధతులు తెలపడానికి 'పొలంబడి' నిర్వహిస్తున్నట్లు ఏఓ తెలిపారు. అధిక రసాయన ఎరువులు, పురుగు మందుల పిచికారీని రైతులు తగ్గించాలని సూచించారు. కలుపు నివారణకు అనుసరించాల్సిన పద్ధతులు వివరించారు. సచివాలయాల పరిధిలో ఉన్న రైతుభరోసా కేంద్రాల్లో సిబ్బంది అన్నదాతలకు సూచనలిస్తారని ఏవో తెలిపారు. ఈ క్రాప్ నమోదును వేగవంతం చేయాలని వీఏఏలను ఆదేశించారు. దివిసీమ ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ సీఈఓ ఎం.వినోద్, ఉల్లిపాలెం వీఏఏ పిల్లి నీలిమ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Avanigadda Branch వారి [illegible]...

[illegible] Regd. Post with Ack Due [illegible]

[illegible]

T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., Vijayawada. 9849431432

రోటరీ సేవలు మరింత విస్తృతం చేయాలి



రోటరీక్లబ్ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, రోటేరియన్లు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం రోటరీ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేసి పేదలకు అండగా ఉండాలని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. మచిలీపట్నం రోటరీక్లబ్ 2024-25 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం రోటరీ హాల్లో జరిగింది. ఆయన నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా పేద ప్రజలకు మరిన్ని సేవలు అందించాలన్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ ఎల్.మోజెస్, ప్రధాన కార్యదర్శిగా అనుపమ ముఖర్జీ, తదితరులతో ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. రోటరీక్లబ్ చరిత్రను తెలిపే పుస్తకాన్ని వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ జ్యోతి, క్లబ్ సభ్యులు అజ్మతున్నీసా, సాయిప్రసాద్, ఫణికుమార్, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

కోడూరు: ఎరువులు, పురుగు మందుల షాపుల్లో వ్యవసాయ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. కోడూరు వంతెన సెంటర్ నుంచి తూర్పు వైపు వరకు ఉన్న షాపుల్లో తనిఖీలు జరిగాయి. పురుగు మందులు, ఎరువుల విక్రయాల రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే అధిక రేట్లకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ శ్రీధర్ హెచ్చరించారు. యూరియా, డీఏపీ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామ సంబరం

ఘంటసాల: భక్తుల కోర్కెలు తీర్చే ఘంటసాల గ్రామ దేవత శ్రీ పెన్నేరమ్మ అమ్మవారి గ్రామ సంబర మహోత్సవాలు శనివారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మ వారికి పంచామృత అభిషేకాలు, నూతన వస్త్రధారణ చేసి శ్రీకాకుళంలోని కృష్ణానదిలో గటమునకు నదీ స్నానం చేయించారు. అనంతరం పెన్నేరమ్మ ఉత్సవ విగ్రహం, ఘటంతో ఘంటసాలలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను ఆహ్వాన కమిటీ ప్రతినిధులు జొన్నలగడ్డ సాయి, రేణు ప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

పాముకాట్లపై అప్రమత్తం

నాగాయలంక: మండలంలో పాముకాట్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రజలు, వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.హరనాథ్ పేర్కొన్నారు. ఆయన కార్యాలయంలో సంబంధిత అధికారులతో శనివారం సమీక్ష సమావేశం జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటికి 35శాతం వరినాట్లు పూర్తయ్యాయని, ఈ సమయంలో రైతులు, వ్యవసాయ కూలీలు పాముకాటు సమస్యలపై అత్యంత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ శివరామకృష్ణ మాట్లాడుతూ మండలంలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మొత్తం 67 పాముకాటు(నాగాయలంక, ఎదురుమొండి పీహెచ్‌సీలు) కేసులు వచ్చాయన్నారు. ఎంపీడీఓ జె.కె సీతారామ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇంద్రకుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.